# మనమంతా ఒకటే

యద్దనపూడి సులోచనారాణి నవలా నాయకుడి లాంటి పర్సనాలిటీ వుంది. అందం వుంది. ఉంగరాల జుట్టు వుంది అయితే నాకు పుష్పక విమానం లాంటి కారు, పిలిస్తే పలికే నౌకర్లు, పెద్దబంగళా ఇవేమీ లేవు లెండి. కాని నాలుగు అంకెల జీతం తెచ్చుకుంటూన్న పెళ్ళికానివాణ్ని అవటంచేత ప్రతివాళ్ళ దృష్టిలోనూ-ఐమీన్-ఆడపిల్లల తండ్రుల దృష్టిలో నేను ప్రముఖుడిగా పరిగణించబడేవాడిని.

ఉద్యోగ విజయంలో ఎన్నో మజిలీలు.

ఈమధ్యనే నేను హైదరాబాద్‌కు దగ్గరవున్న ఇబ్రహీంపట్నం దగ్గర క్రొత్తగా పెట్టిన సబ్ ఆఫీసుకి బదిలీ చేయబడ్డాను. డ్యూటీలో చేరాను. మా ఆఫీసుకు క్రొత్త మహేంద్రా అండ్ కో జీపు వచ్చింది. డ్రైవర్‌ని ఇంకా పోస్టింగ్ చెయ్యలేదు.

రూమ్‌లో కూర్చుని ఈ సంవత్సరమైనా నాన్నా వాళ్ళకు మంచి రేటుగిట్టుబాటయితే ఒక ఇంటివాడిని అవుతానేమో అనుకొని ఆలోచనల్లో వున్నాను.

"మిస్టర్ కుమార్" ఎదురుగా మా ఆఫీసర్.

"రండి సార్" అని లేచినుంచుని సీటు ఆఫర్ చేశాను. ఏమిటన్నట్లు చూశాను.

"క్రొత్త జీపు వచ్చిందికదా. హైద్రాబాద్ సరదాగా వెళ్ళి వద్దాం రండి, క్రొత్తసినిమాలేవయినా వస్తే చూసివద్దాం" అన్నారాయన.

నేను ఇక్కడకు వచ్చి ఇంకా నాలుగైదు రోజులు కాలేదు. నాపై ఇంతప్రేమ వొలకబోస్తున్నా డేమిటబ్బా అనుకుంటూ "డ్రైవర్ లేదు కదా! ఎందుకుసార్ రిస్క్" అన్నాను.

"భలేవారేనే. డ్రైవర్ వచ్చాక మళ్ళా వెళదాం. డ్రైవ్ చేసుకుని వెళదాం" జీపు ఎక్కి బయలుదేరాము.

క్రొత్త జీపు కావటం మూలాన్న సాఫీగా వెళ్ళిపోతూంది. జీపుతో పోటీగా చెట్లు చేమలూ వెనక్కి వెళ్ళిపోతున్నాయి. సాయంసమయమేమో, వాతావరణం ఆహ్లాదంగా వుంది.

"మా బాబాయిగారు వున్నారు హైదరాబాదులో. ఆయనకు ఒక్కగా నొక్క కూతురు. ఆమె M. A. చేసింది. బుద్ధిమంతుడైన అబ్బాయికోసం చూస్తున్నారు" అంటున్నారు మా ఆఫీసర్. సంగతి ఇప్పుడు అర్థమైంది నాకు.

"మీ ఊరు" అన్నారాయన. చెప్పాను.

"మీ ఇంటిపేరు" చెప్పాను. "మీరు"

"ఏమిటి సార్ మీరు అనేది?"

"మీరు....?" "మేము...." చెప్పాను.

"అలాగా" ఆయన ముఖంలో, ఇంతవరకూ నేనంటే వున్న ఆసక్తి, ప్రేమానురాగాలు తొలగిపోయి ఒక విధమైన న్యూనతాభావం ఏర్పడ్డట్లు గోచరించింది.

ఒక్క క్షణం నిశ్శబ్దం తాండవించింది.

"బై ది బై. కుమార్. మీకు హైదరాబాద్‌లో ఎవరున్నారు? నాకు కొంచెం పనివుంది. రేపు రాత్రికి వస్తాను. మీరు నన్ను ఎక్కడ కలుస్తారు?"

హైదరాబాదు దగ్గరలో కనుపిస్తోంది. దేదీప్యమానంగా కోళ్ళ ఫారాల బిల్డింగులు దాటిపోతున్నాయి. వేగంగా, ద్రాక్షతోటలు దాటిపోతుంటే మధురమైన వాసనలు వస్తున్నాయి.

కాని....

నా మనసు ఉడికిపోతూంది-లావాలా-ఈలోగా మలక్‌పేట చేరింది జీపు.

"సార్ జీపు ఆపండి. ఇక్కడ నా స్నేహితుడు వున్నాడు" అన్నాను. జీపు ఆగింది- దిగేను!

జీపు వెళ్ళింది వేగంగా

నా కళ్ళల్లో దుమ్మురేగింది. కాసేపు కళ్ళు మూసుకునిచూస్తే ఎదురుగు ప్రచారశాఖ బోర్డు "మీరు-మేము అని మనసులు పాడుచేసుకోకండి. మనమంతా ఒకటే, చేతులు కలుపుకుని ముందుకు నడవండి. భారత దేశాన్ని ముందుకు నడపండి" అని ప్రబోధిస్తోంది. కాదు-వెక్కిరిస్తోంది. అవును....నిజమే....

—★—